స్త్రీ–విద్య!

# నారీధర్మం!

ఆరేకపూడి (కోడూరి) కౌసల్యాదేవి

ప్రమదలూ పర్వతారోహణ చేయగలరు. వనితలూ వైమానిక చోదకులు కాగలరు. అబలలూ యుద్ధాలు చేయగలరు. స్త్రీలూ రాజ్యాలు ఏలగలరు. మహిళలూ మహోద్గ్రంథాలు వ్రాయగలరు. ముదితలు నేర్వగరాని విద్యేలేదు. ఇవన్నీ చాలా చాలా పాత విషయాలే.

గగన వీధిన విహరించి వస్తున్నారు మన ఆడవారు! అత్యధికులచే 'అబలలూ అసమర్ధులూ' అని భావింపబడే మన ఆడవారు!

ఇది క్రొత్త సంగతి.

అయినా సగటు స్త్రీ ఆలోచనా పరిధిమాత్రం విస్తరించలేదు.

"ఆఁ. ఓ అయ్యచేతిలో పెట్టాల్సిందేగా? ఆడదేమన్నా ఉద్యోగం చేయాలా ఊళ్ళేలా?"

అనే మాటలు మాత్రం ఇంకా అధిక సంఖ్యలో వినవస్తూనే వున్నాయి.

ముఖ్యంగా ఈ మాటలు ఆడవారే అనడం యదార్థం, శోచనీయం.

విద్యాహీనత వలన తాను అనుభవిస్తూన్న లోపం ఏమిటో తెలిసి, అంతర్గతంగా బాధపడే స్త్రీకూడ కుమార్తె విషయంలో అదే మాటలతో పలాయన మంత్రం జపించడం అనేక యిండ్లలో చూస్తున్నాం ఈ ఆధునిక యుగంలో కూడ.

నిజంగా ఆ మాటలు యదార్థంనుండీ, బాధ్యతల నుండీ పలాయనంగా ఉపయోగించే మంత్రాలే.

'ఆడపిల్లను స్కూలుకూ కళాశాలకూ పంపడం వల్ల మగపిల్లలతోపాటూ ఖర్చు చేయడమౌతుంది. అది దండగఖర్చు. ఎందుకంటే ఎటూ పెళ్ళి ఖర్చు ఎదర వున్నదికదా!' అనుకుంటుంది ఒక తల్లి. మగపిల్లవాడు అనేకసార్లు పరీక్ష తప్పినా, స్నేహితులకూ అనవసర విలాసాలకూ విపరీతంగా ఖర్చు చేసినా, అతడి పెండ్లిఖర్చు అమ్మాయి పెండ్లిఖర్చుకంటే అధికంగా అయినా ఆమె మనసులో అది గణనకు రాదు.

'చేతి కంది వచ్చిన ఆడది కూడ చదువులకు పోతే ఇక నాకు చేతి సాయమేదీ యింట్లో?'

అనుకొంటుంది ఇంకో అమ్మ.

'చదువుకున్న ఆడది అణగివుంటుందా?' అనుకుంటారు తండ్రి.

'పనీపాటూ, వంటా వార్పూ వగైరాలు ముఖ్యం కానీ డిగ్రీకెందుకు? భర్తా అత్తవారూ డిగ్రీలు తింటారా, రుచైన వంటకాలు తింటారా? చదువులకూ డబ్బుపోసి, అనక పెండ్లికీ డబ్బు కురిపించడం మాటలా? పనిపాటలు రాకుంటే అనక నన్నేగా అంటారు?'

అని ఇంకోతల్లి అభిప్రాయం.

ఈ అందరిమాటలలోనూ కూడ తలొక విధమైన స్వార్థమూ వున్నది.

'ఉద్యోగం ఊళ్ళేలడం' చేయనవసరం లేకున్నా ఏ దురదృష్టవశాన్నో ఆ అవసరమేగానీ కలిగితే ఉద్యోగం చేయగల సమర్ధత కలిగి వుండాలి ప్రతి వారూ.' అదే సత్యాన్ని విస్మరించుకున్నారు ఈ తెగవారంతా.

డబ్బు వున్నవారూ నిత్యం నీళ్ళలా వాడుకోరు, అవసరమైనప్పుడు ఆ ధనాన్ని వినియోగించుకుంటారు నిశ్చింతగా. అలాగే విద్యకూడ, అది గుప్తధనం వంటిది. అవసరానికి ఆదుకొనే నిధిని మించిన పెన్నిధి.

'ఒక అయ్య చేతిలో పెట్టాలి' అనడంసులువే. అయితే ఆ అయ్య చెయ్యి చివరివరకూ ఆమెకు వుంటుందా?

ఆ అయ్య సాహచర్యమూ తోడూ నీడా జీవితాంతం ఉంటాయన్న భరోసా యేమిటి?

మధ్యలోనే విచ్ఛిన్నమయ్యే వివాహ బంధాలూ, విధివైపరీత్యాలవల్ల వికలమై తిరిగి ఒంటరిపాటునే అనుభవిస్తూన్న అనేక మంది స్త్రీలనూ చూస్తూ కూడ సాధారణ స్త్రీ తన ఆలోచనారీతిని మార్చుకొనక పోవడం శోచనీయం. యువతికి స్వయంగా బ్రతకడానికి సమరత లేకుండా చేసి, నామకార్ధపు వివాహంతో తాము చేతులు కడుక్కుంటున్నారు చాలమంది తలిదండ్రులు.

ఆ వైవాహిక జీవితం బాగుంటే అది అదృష్టం, వికటించితే అది ఖర్మ అని సరిపెట్టుకొంటున్నారు.

కాళ్ళూ, చేతులూ కట్టి నడిసముద్రంలో విసరి 'దేవుడా నీదే భారం' అనడం ఎంతో యిదీ అంతే!

భర్తచే వదలబడిగానీ, భర్త గతించి కానీ దురదృష్టవంతురాలైన స్త్రీ అటు అత్తింటా, ఇటు పుట్టింటా కూడ అందరిచే అవమానింపబడడమూ, భారంగా పరిగణింపబడి పరాయిదానివలె చూడబడి అల్లల్లాడడమూ హిందూ సమాజంలో సర్వసాధారణంగా అందరూ చూస్తున్నారు. ఇందుకు గొప్పా బీదా తారతమ్యంలేదు. ఏ అంతస్థులోనిదైనా సరే ఒంటరి స్త్రీ తన జీవితను తాను ఏర్పరచుకొని తనంత తాను నిలబడగలిగిననాడే గౌరవంగా బ్రతకగలుగుతూన్నది. తన బ్రతుకు తాను బ్రతికితే భర్తలేని దుఃఖం మాత్రమే వుంటుంది; పరాధారంతో బ్రతకవలసి పరుల పంచన జేరితే అంతా దుఃఖమే, అడుగడుగునా శోకమే, నిష్ఠురాలే. ధనవంతురాలే అయినప్పటికీ, భర్త అవసరమే, లేరనే అలుసులో ఆ ధనం పరాయివారు తినకుండా చూచుకోవడానికి విద్య అవసరమే.

ఆడపిల్లకు వివాహంతో ఇల్లూ వాకిలీ ఏర్పడి, భద్రత వుంటుందనేది పాత నానుడిగా అనుకోవలసి వస్తోంది నేటి సమాజ పరిస్థితులలో.

అందుకే యువతికి నేడు విద్యా విషయకంగా సమర్ధత అవసరం: ఆ సమర్ధతే మానసిక బలాన్ని సమకూర్చి కష్టాలలో తట్టుకొని నిలబడే స్థైర్యాన్నిస్తుంది.

ఈ సత్యాన్ని ఇప్పటికైనా అందరూ గ్రహించి ఆడదానికి చదువు అనవసరమనీ ఓ అయ్యచేతిలో పెట్టవలసిన సంరంభమే ముఖ్యమనీ అనే ఊక దంపుడు మాటలను మానాలి. అప్పుడు మన నారీ లోకం నేటికంటె కొంత ఉన్నతిని అందుకో గలదు. □